ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 20 | సంచిక : 8 | ఏప్రియల్ 2015

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

17-02-2015
జిన్నూరు
05-03-2015
చించినాడ

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-02-2015, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ సభలు పెట్టటంలో ప్రధానమైన ఉద్దేశం ఏదో ఒక మతాన్ని ప్రచారం చేయటంకాదు. మనిషి అయిన తరువాత రకరకాల కారణాల వల్ల భయం వస్తూఉంటుంది, దుఃఖం వస్తూఉంటుంది, అశాంతి వస్తూ ఉంటుంది, ఆందోళన వస్తూఉంటుంది. సముద్రంలో కెరటాలు వస్తూ ఉంటే ఆ కెరటాల మధ్యన స్నానం చేసి ఎలా బయటపడతామో అలాగే మీకు వాతావరణాన్నిబట్టికాని, వ్యక్తిగతంగాకాని, సహవాసదోషం వలనగాని ఇలా ఎన్ని సమస్యలు వచ్చినా వాటికి అతీతంగా మీరు దుఃఖం లేని స్థితిలో, అశాంతిలేని స్థితిలో ఉండి మీరు ఒంటరిగా ఉన్నా, నలుగురి మధ్యలో కూర్చున్నా కూడా పూర్ణశాంతి, పూర్ణసుఖం మీచేత అనుభవింప చేయటమే ఈ సభలయొక్క ప్రయోజనం. అంతేగాని ఇవి ఎవరి గురించో ప్రచారం చేయటానికి కాదు. ఇవి కులమతాలకు అతీతంగా జరుగుతున్న ప్రవచనాలు. ఇందులో రిజర్వేషన్స్ ఏమీ లేవు. జీవన్ముక్తుడు ఎటువంటి సుఖాన్ని అనుభవిస్తున్నాడో మీ శరీరాలు ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే అటువంటి సుఖాన్ని మీరు అనుభవిస్తూ, ఈ శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు బయటకు పోయేటప్పడు అశాంతితో కాకుండా శాంతిగా శరీరాన్ని విడిచిపెట్టేటట్లు చేయటమే ఈ ప్రవచనాల యొక్క ప్రయోజనం.

ఈరోజు శివరాత్రి. మనకు కృష్ణాష్టమి, శ్రీరామనవమి ఎటువంటివో శివరాత్రి అటువంటిదే. రామావతారం, కృష్ణావతారం అని చెపుతారు, శివుడు నిత్యావతారం అంటే నిత్యం ఉండే అవతారం. ఈరోజు సాంప్రదాయం పగలు ఉపవాసం, రాత్రి జాగరణ చేస్తారు. ఉపవాసం అంటే కేవలం అన్నం తినటం మానివేయటంకాదు, మనస్సులో విషయచింతన లేకుండా ఉండాలి. జాగరణ అంటే ఏవో సినిమాలకు

వెళ్ళటం, టీవీలు చూసి కాలక్షేపం చేయటంకాదు, శివనామస్మరణతో గడపాలి. శివుడు అంటేనే మంగళం. ఆయన మనకు శుభాన్ని కలుగజేస్తాడు. ఆయన నిరాడంబరుడు. ఆయనకు ఏమీ అక్కరలేదు. కాబట్టే ఇతరులు ఏదైనా అడిగితే వరాలు ఇస్తాడు. అన్నీ నాకే కావాలి అనుకొనేవాడు ఇంక ఇతరులకు ఏమి ఇస్తాడు. వాడికి ఏమీ అక్కరలేదు కాబట్టి నీకు ఏదైనా ఇస్తాడు. వాడు శివుడు. అరుణాచలాన్ని తొలి లింగం అంటారు. శివుడిని లింగరూపంలో అర్చన చేస్తారు. పరబ్రహ్మంకు రెండు ముఖాలు. 1. విష్ణువు, 2. శివుడు. ఏ ముఖం ద్వారా వెళ్ళినా మనం లోపలకు వెళతాము. హిందువులు శివుడినిగాని, విష్ణువునిగాని ఉపాసన చేయటం ద్వారా వారిని ఆధారంగా చేసుకొని ఈ జీవకోటికి, సృష్టికి ఆధారంగా ఉన్న పరబ్రహ్మంను పొందుతారు. శివలింగాన్ని ఆరాధన చేయటం, ధ్యానం చెయ్యటం ద్వారా మనకు ఉన్న అలవాట్లలోనుండి విడుదలపొందుతాము. శివుడు లయకారకుడు. ఆయన మీ మనస్సును అంతర్ముఖం చేస్తాడు. మీ మనస్సు అంతర్ముఖమైతే ఇంక బాహ్యగొడవలలోనుండి, రాగద్వేషాలనుండి అన్నింటినుండి మీరు విడుదలపొందుతారు. శివలింగాన్ని ధ్యానం చేయటంవలన మీ మనస్సు అంతర్ముఖం అయ్యి ఆత్మానుభవం పొందటానికి మీరు అర్హులు అవుతారు.

మనం అందరం ఏదో రూపంతో తాదాత్మ్యం పొందుతున్నాము, నామముతో తాదాత్మ్యం పొందుతున్నాము, గుణముతో తాదాత్మ్యం పొందుతున్నాము. అంటే మనం సాకారంలో ఉన్నాము. కాని సత్యం నిరాకారం, నిర్గుణం. సాకారంలో నుండి నిరాకారంలోనికి వెళ్ళటానికి మనకు నూటికి నూరుపాళ్ళు సహకరించేవాడే శివుడు. పరమేశ్వరుడు చెప్పిన మాటలు, మహాత్ములు చెప్పిన మాటలు మనం చదువుతున్నాము, ఎవరైనా చెపితే వింటున్నాము. ఆ మాటల మీద మనకు విశ్వాసం కలగాలి కదా! ఆచార్యులు, మహాత్ములు, యోగులు ఈ భూమిమీద తిరుగుతున్నారు అంటే ఈశ్వరుడే ఆ రూపం ధరించి ఉన్నాడు. రామకృష్ణ పరమహంస మాటలు చెప్పాడు అంటే అక్కడ పరమేశ్వరుడే ఆ రూపం ధరించి చెపుతున్నాడు. అందుచేత వారిపట్ల గౌరవం లేకుండా, ప్రేమలేకుండా, వారిపట్ల అంకితభావం లేకుండా, ఎంతోకొంత వారిపట్ల భక్తి లేకుండా వారు చెప్పిన మాటలమీద మనకు విశ్వాసం కలుగదు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. దానికి చావులేదు, పుట్టుకలేదు. మీ హృదయంలో ఉన్న నిజానికి ఈ దేహానికి అణుమాత్రం కూడా సంబంధం లేదు. కాని లేదా అంటే ఉంది. అది నీకు అర్థంకాకపోవచ్చు, నీ మెదడుకు అందకపోవచ్చు, నీ కళ్ళకు కనిపించకపోవచ్చు. మహాత్ముల సమక్షంలో, యోగుల సమక్షంలో నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా అది నీకు స్ఫురిస్తుంది. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు నువ్వు దానిని అనుభవించగలవు కాని పుస్తకాలు చదవటం వలన, ఉపన్యాసాలు వినటం వలన వచ్చేది కాదు. నీ హృదయంలో ఉన్న నిజాన్ని

నువ్వు తెలుసుకోలేవు, అది నీకు తెలియబడాలి, మేము బుద్ధిమంతులము అని మీరు అనుకోవచ్చు. మీరు అనుకొన్నంత మాత్రంచేత మీరు బుద్ధిమంతులు కారు. మీరు బుద్ధిమంతులు అని హృదయంలో ఉన్న నిజం అనుకోవాలి. కర్తృత్వం లేకుండా కర్మ చేసేవాడు మాత్రమే బుద్ధిమంతుడు. కర్తృత్వం లేకుండా కర్మచేస్తే నువ్వు చేసినా చెయ్యనివాడితో సమానము, అలా చేయటం వలన నువ్వు టైర్ అవ్వవు. అంటే పనిచేయటం వలన నువ్వు టైర్ అవ్వవు, నేను చేస్తున్నాను అనే భావన వలన టైర్ అయిపోతావు.

మహాత్ములతోటి, యోగులతోటి సాంగత్యం మంచిది. వారు మనతో ఎక్కువగా మాటలు చెప్పరు, వారు చేసేది మౌనంగా చేసుకొనిపోతారు. వారు మీకు చేసే సహకారం అసలు మీకు తెలియాలి అని కూడా వారు అనుకోరు. జ్ఞానికి ఇతురులు లేరు. తన హృదయంలో ఏదైతే ఉందో అదే ఇతరుల హృదయాలలో చూస్తాడు. ఇతరుల హృదయాలలో ఏదైతే ఉందో అదే తన హృదయంలో ఉందని వాడికి తెలుస్తూ ఉంటుంది, అంటే ఆ వన్‌నెస్ వాడికి తెలుస్తూ ఉంటుంది. మాటలకంటే మౌనం మంచిది. మౌనానికి ఉన్న శక్తి మాటకి లేదు. మీ శరీరాలు ఎక్కడ ఉన్నా, ఏ దేశంలో ఉన్నా, ఏ ప్రాంతంలో ఉన్నా భగవంతుడి పట్ల మీకు మానసికఅనుబంధం ఉండాలి. కైలాసంలో శివుడు ఉన్నాడు. అరుణాచలంలో శివుడు ఉండటంకాదు, అరుణాచలమే శివుడు అంటే ఆ కొండే శివుడు. ఆ కొండ దేవుడు అనటం నిజమా అని భగవాన్‌ను అడిగారు. నీకు నిజం కావాలా? ఈ దేహమే నేను అని నువ్వు అనుకొంటున్నావు, అది నిజమా? ఈ శవాన్ని నువ్వు అనుకోవటం ఎంత నిజమో, ఆ కొండ నేను అని శివుడు అనుకోవటం కూడా అంతే నిజం. నిజమైన అరుణాచలం నీ హృదయంలోనే ఉంది.

కొంతమంది ఏమంటున్నారు అంటే మాకు ఇంటి దగ్గరే బాగుంది అరుణాచలం వస్తే కొత్తవాసనలు వస్తున్నాయి అంటున్నారు. మీకు తెలియకుండా మీ హృదయంలో చాలా బలహీనతలు ఉంటాయి. పునర్జన్మను తీసుకొనివచ్చే కారణాలు మీ హృదయంలో ఏమి ఉన్నాయో మీకు తెలియదు. మీ హృదయంలో ఏదైనా బలహీనత ఉంటే మీకు తెలియకుండా దానిని బయటకు గెంటటానికి అవకాశం లేదు. అవి మీకు తెలియటానికే మీ హృదయాన్ని కెలికి వాటిని మీ మెదడులోనికి తీసుకొనివచ్చి మీలో ఏ బలహీనతలు ఉన్నాయో మీకు తెలియజేస్తున్నాడు, అదే అరుణాచలేశ్వరుడు చేస్తున్నాడు. దానిని చూసి మీరు కంగారుపడవద్దు. మీలో ఉన్న బలహీనతలను మీకు తెలియజేసి వాటిని బయటకు గెంటి మిమ్మల్ని పరిశుద్ధుడిగా చేసి ఆయనలో ఐక్యం చేసుకొంటాడు. స్వామీజీ రామకృష్ణుడితో ఏమనేవాడు అంటే మీరు నావంక చూస్తున్నారు ఏమిటి? ఇక్కడ ఇంక జనం లేరా చూడటానికి, నా వంక అలా చూడకండి అనేవాడు. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే నాకు నీ మీద ఇష్టం పోవటంలేదు చూడాలని నిన్ను చూడటంలేదు, ఇష్టాన్ని పోగొట్టుకోలేక చూస్తున్నాను అని చెప్పాడు. నరేంద్రుడు రామకృష్ణుడి

దగ్గరకు మొదట వచ్చినప్పుడు వెస్ట్రన్‌డోర్‌లోనుండి లోపలకు వచ్చి కూర్చొంటాడు. స్వామీజీని నీ పేరు ఏమిటి, నువ్వు ఎక్కడనుండి వచ్చావు అని రామకృష్ణుడు అడగలేదు. చైల్డ్, చైల్డ్, డియర్ చైల్డ్, మైడియర్ చైల్డ్, కం, కం, కం టు మి, ఐ కెనాట్ లివ్ విత్‌ఔట్ సీయింగ్ యు, నిన్ను చూడకుండా నేను బతకలేను, నిన్ను చూడకుండా నేను ఉండలేను అంటాడు రామకృష్ణుడు. ఆ మాటలలో ఉన్న బరువు చూడండి, ఆ మాటలలో ఉన్న పూర్వజన్మల అనుబంధం చూడండి. అది జన్మాంతర అనుబంధం. మీలో ఎవరికైనా జన్మాంతర అనుబంధం ఉంటే చనిపోయేవరకు ఒకేరకంగా ఉంటారు. ఒకరి పొరపాట్లను ఇంకొకరు మన్నించుకుంటారు. ఇంకో రహస్యం ఉంది. గురువు శిష్యుడిని ఎన్నుకొన్నాడు అనుకోండి ప్రమాదం లేదు. శిష్యుడు గురువును ఎన్నుకొంటే ఆ గురువు సిగరెట్లు కాలుస్తూ ఉంటే ఏమిటి గురువు సిగరెట్లు కాలుస్తున్నాడు అని శిష్యుడు అనుకొంటాడు. అదే గురువు కనుక శిష్యుడిని ఎన్నుకొంటే ఆ గురువు గొడవ ఏమి శిష్యుడికి అక్కరలేదు.

మీరు ఏ దేశంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా భగవంతుడితోటి మానసిక అనుబంధం పెట్టుకోండి. మీరు ఏ భగవంతుడితో అయితే మానసిక అనుబంధం పెట్టుకొన్నారో ఆయన మీ హృదయంలో కూడా ఉన్నాడు. బయటఉన్నవాడు నీ మనస్సు బహిర్ముఖం అవ్వకుండా నిన్ను కాపాడి, నీ మనస్సును అంతర్ముఖం చేసి లోపలఉన్న అంతర్యామికి పట్టియిస్తాడు. అంటే బయటఉన్న ఈశ్వరుడు నిన్ను లోపలకు గెంటుతాడు. నీలోపల అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు నిన్ను లోపలకు గుంజుకొని ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. బయట ఉన్నవాడు, లోపలఉన్నవాడు వేరుకాదు, ఇద్దరూ ఒక్కటే, ఉన్నదంతా ఒక్కటే. గురువు యొక్క శరీరం చనిపోయిన తరువాత ఆయనతో సంబంధం తెగిపోతుందా అని అడుగుతున్నారు. గురువు అంటే ఆ శరీరమా? గురువు అంటే ఆ శరీరమే అయితే శరీరం పోయినప్పుడు అనుబంధం తెగిపోతుంది. గురువు అంటే శరీరం కాదు. అందుచేత ఆ శరీరం మరణించిన తరువాత కూడా నీకు ఆయనతో ఉన్న అనుబంధం నిలుస్తుంది. నీకు తెలుసున్నా, తెలియకపోయినా నీకు ఆత్మసాక్షాత్కారం కలిగేవరకు అనుగ్రహం నిన్ను వెంటాడుతుంది. ఆయనే గురువు. ఇప్పుడు మేము భగవాన్‌ను వదులుకొందాం అనుకొంటున్నాము, అయితే ఆయన మమ్మల్ని వదిలేలా లేడు, ఎందుచేతనంటే అది పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క. మనం పట్టుకొంటే ఒకవేళ విడిచిపెట్టేయాలంటే విడిచిపెట్టేయవచ్చు. కాని ఆయన పట్టుకొన్నాడు కాబట్టి మనం విడిచిపెట్టేద్దామన్నా ఆయన విడిచిపెట్టే అవకాశం లేదు. గురువు నిన్ను అనేక రకాలుగా అనుగ్రహించవచ్చు. రామకృష్ణుడు టచ్ చేసేవాడు. ఒకసారి రామకృష్ణుడు ఆయన కాలు తీసి నరేంద్రుడి తలమీద పెట్టాడు. ఏమయ్యా ఏమిటి నువ్వు ఏమి చేస్తున్నావు అన్నాడు. నాకు ఇల్లు ఉంది, ఇంటి దగ్గర అమ్మ, తమ్ముళ్ళు ఉన్నారు, వారు కనబడకుండా పోతున్నారు

అన్నాడు నరేంద్రుడు. అంటే నిర్గుణంలోనికి, నిరాకారంలోకి ఎంతవరకు వెళ్ళగలడో చూస్తున్నాడు. నరేంద్రుడికి భయం వేస్తోంది. ఆయన సాకారాన్ని, సగుణాన్ని విడిచిపెట్టలేకపోతున్నాడు. అప్పుడు కాలు తలమీద నుండి తీసేసి సరిపోతుంది అని చెప్పలేదు, ప్రస్తుతానికి సరిపోతుంది అన్నాడు రామకృష్ణుడు. సాకారంలోనుండి నిరాకారంలోనికి వెళ్ళటానికి ఆధ్యాత్మికంగా కొంతస్థాయి ఉండాలి. ఒక మహాత్ముడి యొక్క విలువ ఇంకో మహాత్ముడికి తెలుస్తుంది కాని సామాన్య మానవులకు అర్థంకాదు. ఎఱ్ఱవాడ జైలులో ఉండగా మహాత్మాగాంధీని చూడటానికి రవీంద్రనాథ్‌టాగూర్ వెళ్ళారు. మహాత్మాగాంధీ, టాగూర్ కౌగిలించుకున్నారు. సరిపోతుంది అన్నాడు టాగూర్. నాకు ఇంకా సరిపోవటంలేదు అన్నారు గాంధీగారు. ఈ మధ్య ప్రిన్సిపల్ సెక్రటరీగారు జిన్నూరు వచ్చారు. ఆయనకు రమణకేంద్రం కూడా చూపించాము. ఆయన వెళ్ళిపోయేటప్పుడు వీడుకోలు చెపుతూ ఈ రోజున మీరు నేను కలుసుకున్నాము, ఈ రోజు మంచి లక్ష్మీవారం అన్నాను. మంచి లక్ష్మీవారమే మీకా నాకా అన్నారు ఆయన. ఎవరికి మంచి లక్ష్మీవారం? మీకు మంచి లక్ష్మీవారమా? నాకు మంచి లక్ష్మీవారమా? అన్నారు. ఈ మాటలు ఎందుకు చెపుతున్నాను అంటే ఎదుటి మనిషిలో ఏదైనా ఔన్నత్యం ఉంటే అది నీకు తెలియబడాలి అంటే ఎంతోకొంత ఔన్నత్యం నీలో కూడా ఉండాలి లేకపోతే అది నీకు తెలియదు. నీకు లేదు అనుకో ఏమీ తెలియదు. నీలో ఎంతోకొంత పవిత్రత లేకపోతే చివరకు శ్రీరాముడే వచ్చి నీ ప్రక్కన కూర్చున్నా నీకు ఏమీ తెలియదు.

నీకు కోరికలు, అలవాట్లు, వాసనలు బలీయంగా ఉన్నప్పుడు కొంతకాలం మహాత్ముల సమక్షంలో ఉంటే, ఎవాల్వ్‌డ్ సోల్స్ దగ్గర ఉంటే వారి సమక్షంలో కోరికలు, వాసనలు నెమ్మదిగా అణుగుతాయి, నీ మనస్సు నిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది, సత్యసాక్షాత్కారానికి ప్రిపేర్ అవుతుంది. నీకు ఉన్న బలహీనతలు నువ్వు కాదు, అవి తెచ్చిపెట్టుకొన్న అలవాట్లు. అవి అణిగితేనేగాని నీ మనస్సు నిర్మలమవ్వదు. మనస్సు నిర్మలమైతేగాని నీకు సమాధిస్థితి కలుగదు. అందుచేత వాసనలు అణగటానికి, నిన్ను ఉన్నతస్థాయికి ప్రిపేర్ చేయటానికి మహాత్ములయొక్క సమక్షం అవసరం. అయితే ఒకవేళ నీకు ఏమైనా అనుభవం కలిగితే, నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు స్ఫురిస్తూ ఉంటే అది నీ తెలివితేటలు అనుకోవద్దు. మహాత్ముల సమక్షం వలన, గురువు సమక్షం వలన నువ్వు కొన్ని అనుభవాలు పొందుతావు. సనత్‌కుమారుడు వాళ్ళకి దక్షిణామూర్తి సమక్షంలో వాసనలు అణిగిపోయి, పునర్జన్మకారణాలు కాలిబూడిద అయిపోయి సద్వస్తువు స్వరూపంగా వ్యక్తమయ్యింది అంటే అది దక్షిణామూర్తి ఔన్నత్యమేకాని వారి ఔన్నత్యంకాదు. అలాగే నువ్వు ఏదైనా పొందితే అది గురువు దయవల్ల మాత్రమే. నదిని దాటటానికి నావ ఎటువంటిదో ఈ సంసారసాగరాన్ని దాటటానికి సత్సంగం నీకు నావలాగ ఉపయోగపడుతుంది. సత్సంగంకంటే విలువైనది, విశేషమైనది ఈ మూడు

లోకాలలో ఏమీ లేదు అని చెపుతున్నారు. నీకు బ్రాహ్మీస్థితి పొందినవాడు దొరకనప్పుడు సత్యాన్వేషకుడియొక్క సాంగత్యం కోసం అయినా అన్వేషించు. మా చుట్టు ప్రక్కల సత్పురుషులు లేరు అని బుద్ధుడితో అంటే నీకు సత్పురుషులు దొరకకపోతే అడవిలో ఏనుగులాగ ఒంటరిగా బతుకు అంటే నీకు హోలీకంపెనీ దొరకనప్పుడు ఏకాంతవాసం మంచిదే. మీ హృదయంలో ఉన్న సత్యం మీకు అనుభవంలోనికి రావాలి అంటే ఆ అనుభవం పొందినవారి దగ్గరకాని, ఆ అనుభవంకోసం ప్రయత్నం చేసేవారు ఎక్కడ ఉన్నారో వెతికి వారి సమక్షంలోకాని కొంతకాలం జీవించటానికి ప్రయత్నం చేయాలి.

రామకృష్ణుడు చెప్పిన ఒక వాక్యం చెపుతాను. ఈ వాక్యం నన్ను బంధించింది, నా మనస్సును తేలిక పరిచింది. ఈశ్వరుడే కర్త. ఈశ్వరుడు మాత్రమే కర్త కాని నేను కర్తను అని మానవుడు అనుకొంటున్నాడు. కర్తవాడు కాకపోయినా నేనే కర్తను అని వాడు అనుకొంటున్నాడు కాబట్టి వాడికి దుఃఖం వస్తోంది. కర్త ఈశ్వరుడే. నేను ఎంతమాత్రము కర్తనుకాదు అని నోటితో చెప్పటంకాదు, మనస్సుతో స్మరించటంకాదు, ఈ వాక్యాన్ని నీ హృదయంలో అనుభవించినప్పుడు నీవు జీవన్ముక్తుడవు అవుతావు అని చెప్పాడు. దుఃఖానికి కారణం కర్తృత్వం. ఒక మనిషికి దుఃఖం వస్తోంది అంటే అక్కడ కర్తృత్వం ఉండి తీరాలి. కర్తృత్వం లేనివాడికి దుఃఖంలేదు. అర్జునా! కర్తృత్వం లేకుండా మూడు లోకాలను భస్మం చేసినా నీకు దోషం లేదు అని పరమాత్మ చెప్పాడు. నా చేతిలో కత్తి ఉంది అనుకోండి. ఆ కత్తి పుచ్చుకొని ఎవరి తలకాయ అయినా నరికితే పాపం కత్తికి వస్తుందా? నాకు వస్తుందా? మిమ్మల్ని నేను నరకలేదు, కత్తే నరికింది అయినా కత్తికి పాపం రాదు, నాకే పాపం వస్తుంది. ఎందుచేతనంటే ఆ కత్తి నా చేతిలో పనిముట్టు కింద ఉపయోగపడింది. కత్తి చంపినట్లుగా మీకు అనిపిస్తుంది కాని ఆ కత్తితో చంపినవాడిని నేను. అందుచేత దోషం నాకు వస్తుంది కాని కత్తికిరాదు. కత్తిని ఏవిధంగా అయితే నేను ఉపయోగించుకొంటున్నానో ఈ సృష్టిలో ఉన్న జీవకోటిని పరమేశ్వరుడు ఉపయోగించుకొంటున్నాడు.

లక్ష్మణుడు కైకేయిని తిడుతూ ఉంటాడు. అప్పుడు రాముడు ఏమన్నాడు అంటే లక్ష్మణా! మనల్ని తల్లికంటే ఎక్కువగా ప్రేమించినటువంటి కైకేయిలో అకస్మాత్తుగా ఇంతమార్పు ఎందుకు వచ్చింది అనుకొంటున్నావు. నా శరీర ప్రారబ్ధంలో నేను అడవికి వెళ్ళవలసి ఉంది. నన్ను అడవికి పంపటానికి ఈశ్వరుడు కైక నోరును ఉపయోగించుకొన్నాడు కాని కైక ఎవరు మనలను అడవికి పంపటానికి. ఈ దేహం భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పని చేయించటానికి కైకను పరమేశ్వరుడు పనిముట్టుకింద ఉపయోగించుకున్నాడు అంతే. మీరు నమ్మినా, నమ్మకపోయినా ఇది సత్యం. నీ శరీరం ద్వారా మంచి జరిగినా, చెడ్డ జరిగినా ఈశ్వరుడే కర్త. నేను కర్తనుకాదు, ఈశ్వరుడే కర్త. చేసేదంతా ఆయనే అని

నోటితో చెప్పినా ప్రయోజనం లేదు, అది నీకు అనుభవంలోనికి రావాలి. ఈశ్వరుడి మీద భక్తి కుదిరినప్పుడు ఈ వాక్యం నీకు అర్థమవుతుంది కాని లేకపోతే అర్థంకాదు. రామకృష్ణుడి మాటలలో చెప్పాలి అంటే స్త్రీకి తన భర్తమీద ఎంతప్రేమ ఉంటుందో, పరమలోభికి డబ్బుమీద ఎంత ప్రేమ ఉంటుందో ఈ రెండూ కలవాలి. ఈ రెండూ కలిస్తే మొత్తం ఎంత ప్రేమ ఉంటుందో అంత ప్రేమ నీకు ఈశ్వరుడి మీద ఉన్నప్పుడు ఈ వాక్యం అనుభవంలోనికి రావటానికి అది నీకు సహకరిస్తుంది. ఈ వాక్యం హృదయంలో నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంక నీకు జన్మలన్నీ కట్ చేసేస్తారు. ఇంక శవాలను మోయవలసిన పనిలేదు.

కళ్ళు చేసే పని కళ్ళు చేస్తాయి, చెవులు చేసే పని చెవులు చేస్తాయి. మాకు కళ్ళు సరిగా కనబడటంలేదు. నువ్వు ఎలాగు వింటున్నావుకదా, చూడటం కూడా చెయ్యి అని చెవులను అడిగితే అవి చూసిపెడతాయా? లేదు. ఎందుచేతనంటే చూడటం చెవులకు తెలియదు. అలాగే డబ్బుకు చేతకాని పనిని డబ్బుని చేయమని అడగకూడదు. డబ్బు శరీరానికి కంఫర్టు ఇస్తుందికాని మైండ్‌కు కంట్రోలును ఇవ్వలేదు. నీకు వెయ్యికోట్లు డబ్బు ఉన్నా కర్తృత్వం ఉంటే దుఃఖం వచ్చేస్తుంది. ఈశ్వరుడే కర్త, నేను కర్తను కాదు. ఇది నీ రక్తంలో కలిసిపోవాలి. ఈ వాక్యం నీకు అనుభవంలోనికి వస్తే నీ హృదయంలో నుండి ఆనందం పొంగి వచ్చి నీ మెదడును ముంచేస్తుంది.

భగవద్గీతలో ఒక శ్లోకం ఉంది. ఇది నాకు మరింత ప్రియం. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు. అర్జునా! నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇది వాస్తవం, ఇది నిశ్చయం. ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన మన కళ్లకు కనబడటంలేదు, మన చెవులకు వినబడటం లేదు. ప్రారబ్దాన్ని బట్టి మన శరీరాలను బొమ్మల కింద ఆడిస్తున్నాడు. మనకు వివేకం, వైరాగ్యం లేని మూలంగా మనలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నప్పటికీ ఆయన మనకు అవగాహన కావటంలేదు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో ఒక రోజు తెల్లవారుఝామున నాలుగింటికి గాంధీగారిని, మహదేవ్ దేశాయ్‌ని అరెస్టు చేస్తున్నారు. గడియారం రాత్రి 12 గంటలు కొట్టింది. అప్పడు బాపూజీ భార్య బాపూజీని లేపింది. అలా నిద్రపోతున్నారు ఏమిటి? గడియారం 12 గంటలు కొట్టేసింది. నాలుగింటికి పోలీసులు వచ్చి జైలుకు తీసుకొనిపోతారు. ఇంకా నిద్రపోతారేమిటి అంది. ఎప్పడో నాలుగింటికి కదా వెళ్ళేది, ఈ లోపుగా నిద్ర చెడగొట్టటం ఎందుకు అని మరల బాపూజీ పడుకొన్నారు. అదీ వైరాగ్యం అంటే. మనకు అయితే అలా నిద్ర పడుతుందా? నాలుగింటికి జరగవలసింది జరుగుతుంది, ఈలోపులో నిద్ర చెడగొట్టుకోవటం ఎందుకు అని మరల నిద్రపోయాడు. వాడు బాపూజీ. అంటే

అక్కడ వైరాగ్యం ఉండటం వలన ఆందోళన లేదు. ఉన్న విషయం ఉన్నట్లుగా మనకు అర్థం అవ్వకపోవటానికి కారణం ఏమిటి అంటే మనకు వివేకం లేదు, వైరాగ్యం లేదు.

స్వార్థపరుడికి ఆత్మజ్ఞానం కలుగదు. వాడు ఏ మతంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా, వాడికి ధనం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు, పాండిత్యం ఉండవచ్చు, వాడికి ఎన్ని ఉన్నప్పటికీ ప్రపంచంలో ఇంతవరకూ ఏ స్వార్థపరుడికి ఆత్మజ్ఞానం కలుగలేదు. స్వార్థం లేని స్థితికి ప్రతీక పరమేశ్వరుడు. మనం పూర్తిగా స్వార్థం విడిచిపెట్టగలమా అంటే శివుడిలాగ పూర్తిగా విడిచిపెట్టలేకపోవచ్చు, కనీసం కొంతకూడా మనం తగ్గించుకోవటంలేదు. ఎవరు చెప్పినా వారి కుటుంబ సమస్యలగురించి చెపుతారు గాని సమాజం గురించి ఎవరూ మాట్లాడరు. మనం ఎవరికైనా చిన్న సహాయం చేసి ఏదో త్యాగం చేసేసాను అనుకొంటాము. సొమ్ము అంతా పరమేశ్వరుడిదే. నువ్వు ఇతరులకు ఏదైనా సహాయం చేసినా అది తిరిగి నీకే వస్తుందని తెలియకపోవటం వలన నేను ఏదో త్యాగాలు చేసాను అనుకొంటావు. మనస్సు అణగాలి. మనస్సు అణగకుండా ఆత్మానుభవం కలిగే అవకాశం లేదు. ఎంతసేపు వారు తిట్టారు, వీరు కొట్టారు అని ఇలా అనుకొంటూనే చస్తావా? ఇంక నీ జీవితానికి ఒక గమ్యం అంటూ ఏమీ లేదా? నువ్వు పొందవలసిన స్థితి ఏదో పొందటానికి నువ్వు ఏమీ శ్రవణం చేయటం లేదు. అసలు శ్రవణం చేయకుండా నీకు ఏమి తెలుస్తుంది. శ్రవణం చెయ్యాలి కదా!

లోకంలో నీకు ఎక్కడైనా పాపం కనిపిస్తూ ఉంటే నీలో ఉన్న కోరిక, నీలో ఉన్న కోపం, నీలో ఉన్న అసూయ, నీలో ఉన్న లోభిత్వం అంతా కలిపి లోకంలో పాపం కింద కనిపిస్తోంది. నీలో లేనిది బయట ఎక్కడా ఏమీ లేదు. నీకు ఎక్కడ ఏ దోషం కనిపిస్తున్నప్పటికీ ఆ దోషం నీ హృదయంలో కూడా ఉండి ఉండాలి. మనం అందరం బయటనుండి లోపలకు తీసుకొనే వాటిలో చాలా జాగ్రత్తగా ఉంటాము. అన్నం తినేటప్పుడు అందులో నలకలు ఏమైనా ఉన్నాయేమో చూసుకొంటాము. కాని లోపల నుండి బయటకు వచ్చే మాటల విషయంలో జాగ్రత్తపడటంలేదు, ఆలోచన లేకుండా మాట్లాడతాము. మాట సౌమ్యంగా ఉండాలి. నువ్వు మాట చెప్పేటప్పుడు ఇతరులపట్ల ప్రేమ, ఆప్యాయత ఉండాలి. నువ్వు చెప్పేమాట వారికి అవగాహన అవ్వాలి. వారికి సబ్జక్టు అర్థంకాకపోతే మనలోనే ఏదోలోపం అనుకోవాలి. వినేవాడిపట్ల ఆప్యాయత లేకుండా నువ్వు యాంత్రికంగా ఎంత చెప్పినా దాని వలన ఏమీ ప్రయోజనం లేదు.

ఇక్కడ భగవాన్ మౌ గురించి చెపుతున్నారు, రోజుల తరబడి, నెలల తరబడి, సంవత్సరాల తరబడి ప్రవచనాలు చెపుతారా. మీరు ఎన్నాళ్ళు ఇలా చెపుతారు. మీకు నిజమైన మౌనం కుదిరితే, మీ ఇంద్రియాలు మనస్సు హృదయంలో అణిగిపోయి అక్కడనుండి మౌనంవస్తే మీరు జీవితం పొడుగునా ప్రవచనాలు చేసింది, వంద సంవత్సరాలు టీచ్

చేసింది ఒక్క క్షణంలో మీ సమక్షంలో ఉన్న వారికి సత్యాన్ని అందివ్వవచ్చు. నువ్వు ఎంత పండితుడవు అయినా, ఎంత మహోన్నతుడవు అయినా మనస్సు, ఇంద్రియాలు హృదయంలో అణగకపోతే అది జ్ఞానమా? ఇలా నువ్వు ఎన్ని శవాలను మోస్తావు. మాకు వచ్చే జన్మ ఎటువంటి జన్మ వస్తుందని చాలామంది అడుగుతూ ఉంటారు. ఇప్పడు ఈ శరీరం ఎలా ఉందో వచ్చే జన్మ వచ్చినప్పడు ఇంకో శరీరం ఉంటుంది. అది ముసలిది అయిపోతుంది, చనిపోతుంది ఇంకో జన్మ వచ్చినా అది ఉంటుందా? ఇప్పడు ఒక అబద్ధంలో ఉన్నావు. ఒక అబద్ధంలో ఉండి ఇంకో అబద్ధం గురించి తెలుసుకోవాలి అనుకొంటావు ఏమిటి? కొన్నివిషయాలు మన మలినబుద్ధికి అందవు. మనకు ఏకాగ్రత, పవిత్రత లేకపోవటం వలన ఆ విషయాలను గ్రహించే శక్తి లేకపోవటం వలన కొన్ని విషయాలు మనకు అందవు. శివుడు గురువులకు గురువు. ఆయన దక్షిణామూర్తి అవతారం ఎత్తి మొత్తం సబ్జక్టు అంతా ఒక మాట లేకుండా, మౌనంగానే వారి హృదయాలకు హత్తుకునేలా చేసాడు. అది మౌనం యొక్క వైభవం. నువ్వు మౌనంగా ఉన్నప్పడు అందులోనుండి వచ్చే కంపేషన్ వలన వారికి ఆ సబ్జక్టు అవగాహన అవుతుంది. జీవితం పొడుగునా ప్రసంగాలు చేసి తెలియపర్చలేనిది ఆ మౌనంలో ఒక్క క్షణంలో ఇతరులకు నువ్వు తెలియపర్చవచ్చు. ఆ శక్తి మౌనానికి ఉంది. అయితే ఆ మౌనం హృదయగతమైన మౌనం. జ్ఞాని ఏమి చేస్తాడు అంటే నిన్ను అనుగ్రహిస్తున్నాడు అనుకో అది నీ ప్రక్కవాడికి కూడా తెలియనివ్వడు. వారు మౌనంగానే పనిచేస్తారు. సత్యానికి పబ్లిసిటీ అక్కరలేదు. నువ్వు కూడా అలా ఉంటేనే అది నీకు ఎరుకలోనికి వస్తుంది. కాని మనం ఎవరికైనా చిన్నగడ్డిపరక ఇస్తే దానికి పెద్ద పబ్లిసిటీ కావాలి.

మీరు మంచిపనులు చెయ్యండి. ఒక మంచిపని చేస్తూ నువ్వు చనిపోతే నీకు స్వర్గం వస్తుంది. ఆ పనిలో సక్సెస్ అయితే కీర్తి వస్తుంది. నీ శరీరం చనిపోయినా నువ్వు సాధించింది సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఉంటుంది. మేము బతికి ఉండగా చనిపోయిన వారితో సమానము. మీరు మంచిపనులు చేస్తే శరీరాలు చనిపోయినా ఈ లోకంలో జీవించే ఉంటారు, మల్లెపూవు ప్రక్కన కూర్చొన్నప్పడు మల్లెపూవుల వాసన వస్తుంది. నేను వాసన ఇవ్వాలి అని మల్లెపూవు అనుకోదు. అలాగే ఒక మహాత్ముడు, ఒక మహర్షి సమక్షంలో ఉన్నప్పడు ఆయన నుండి జ్ఞానతరంగాలు, కాంతితరంగాలు నీకు రావటమే కాకుండా, నేను బాగుపడాలనే తలంపు కూడా నీకు వస్తుంది. మీరు తొందరపడకూడదు. ఏకాలంలో ఏది జరగాలో అది జరుగుతుంది కాని మనం తొందరపడటం వలన ఏమీ రాదు.

మనం ఏదైనా పుస్తకం చదివేటప్పడు అంతా జ్ఞాపకం పెట్టుకోనక్కరలేదు. ఈ వాక్యం మనకు అవసరం, ఇది మన జీవితానికి ఉపయోగపడుతుంది అనుకొన్న దానిని మన

హృదయంలో అయినా దాచుకోవాలి లేకపోతే పుస్తకంలో అయినా వ్రాసుకోవాలి. ఆ వాక్యం మన హృదయంలో కాపురం ఉండాలి. రాత్రి ఒంటిగంటకు మెలకువ వస్తే ఆ వాక్యం నీకు గుర్తుకు రావాలి. డబ్బు సంపాదించే వారు ఎందుకు సంపాదించుకొంటారు. అవసరమైతే ఉపయోగపడుతుంది అని డబ్బు సంపాదిస్తారు. అలాగే నువ్వు చదివిన చదువుకూడా అవసరమైనప్పుడు నీకు ఉపయోగపడాలి లేకపోతే ఆ చదువు ఎందుకు? పుస్తకంలో ఉన్న సారం మీ మస్తకంలోనికి రావాలి. మీ మస్తకంలోనికి వస్తే అది మీకు ఉపయోగపడుతుంది లేకపోతే ఉపయోగపడదు. బ్రాహ్మీస్థితి పొందటానికి నీకు ఉన్న తెలివి తేటలను ఉపయోగించుకో లేకపోతే ఆ తెలివితేటలవలన నీకు ప్రయోజనం ఏమీలేదు. నీ కంటిలో ఉన్న దూలాన్ని చూసుకోవటం మానేసి ఎదుటివాడి కంటిలో ఉన్న నలుసును చూస్తావేమిటి? అంటాడు ఏసు. అంటే నీకు రంధ్రాన్వేషణ అలవాటు అయిపోయింది. నీకు శాంతి కావాలంటే, నీ మనస్సు నిర్మలంగా ఉండాలంటే ఇతరులలో ఉన్న దోషాలను చూడకు, నీకు రంధ్రాన్వేషణ వద్దు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-03-2015, చించినాడ)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం చేసే కర్మలో భక్తి ఉండాలి, జ్ఞానం ఉండాలి. ఈ రెండూ కలిపి చేసిన కర్మ సఫలమవుతుంది, అది పదిమందికీ ఉపయోగపడుతుంది. అలా కర్మ చేసిన వారు ధన్యులు అవుతారు. వారు మాత్రమే పరలోకరాజ్యానికి వెళ్ళటానికి అర్హులు అవుతారు. సర్వసాధారణంగా మనకు ఏమి కట్టుకొంటున్నాము, ఏమి తింటున్నాము అనే గొడవేకాని మన చుట్టూ సమాజం ఉందనే దృక్పథం మనకు చాలా తక్కువ. మన శరీరాలు అన్నీ చనిపోయే శరీరాలే. ఈ శరీరం చనిపోకముందే మనం చావులేనిస్థితిని పొందాలి, అదే మన జీవితగమ్యం. మన హృదయంలో అనేక కోరికలు, ఆకర్షణలు, వాసనలు, పూర్వజన్మ సంస్కారాలు, భోగాలు అనుభవించాలనే దృక్పథం ఇలా అనేకం ఉంటాయి. వీటిలోనుండి హృదయాన్ని ఖాళీ చేయటం చాలా కష్టమైన పని. వెయ్యికోట్లు డబ్బు సంపాదించవచ్చు, అనేక భవనాలు కట్టవచ్చు కాని మన హృదయంలో ఉన్న బలహీనతలను తొలగించి హృదయాన్ని ఖాళీ చేయటం ఎవరో కొంతమందికే సాధ్యం. మనం సాధన చేసినా ఇందులో సక్సెస్ అవ్వలేము. దీనికి అంతర్యామి యొక్క దయ ఉండాలి.

మనలను, మన కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచాన్ని, పంచభూతాలను నడిపించే వాడే ఈశ్వరుడు. ఆయనే ప్రభువు. మనలను పరిపాలించేవాడు కైలాసంలో ఉన్నాడా, వైకుంఠంలో ఉన్నాడా, కాశీలో ఉన్నాడా, అరుణాచలంలో ఉన్నాడా అంటే ఆయన మనకు ఎక్కడో దూరాన లేడు మనలో అంతర్యామిగా మన హృదయంలోనే ఉండి ప్రారబ్ధం